నమస్తే తెలంగాణ

# జనగామ

8 | వరంగల్, ఆదివారం 1 జూన్ 2025 | JANAGAON




| జిల్లా | సన్న వడ్ల కొనుగోలు(టన్నుల్లో) | చెల్లించాల్సిన బోనస్ (రూ.కోట్లలో) |
|---|---|---|
| మహబూబాబాద్ | 1,17,350 | 58.67 |
| వరంగల్ | 63,800 | 31.90 |
| ములుగు | 22,470 | 11.23 |
| జనగామ | 20,150 | 10.07 |
| హనుమకొండ | 15,500 | 7.75 |
| జయశంకర్ భూపాలపల్లి | 8,065 | 4.03 |
| మొత్తం | 2,47,335 | 123.65 |

*కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అష్టకష్టాలు పెడుతున్నది. యాసంగిలో సాగు నీళ్లు ఇవ్వక అరిగోస పెట్టింది. కళ్ల ముందే వరి పంట ఎండిపోతుంటే.. నరకయాతన పడి రక్షించుకొని.. అనేక తంటాల నడుమ ధాన్యం అమ్ముకున్న అన్నదాత.. రెండు నెలలుగా క్వింటాకు రూ. 500 చొప్పున సన్న వడ్ల బోనస్ రాక ఇబ్బందులు పడుతున్నాడు. వానకాలం రావడంతో పెట్టుబడి డబ్బులు లేక రైతులు అప్పు కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తుండగా.. రాష్ట్ర సర్కారు మాత్రం యాసంగి పంటకూ ఇస్తామన్న బోసన్ చెల్లించక నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది.*

*- వరంగల్, మే 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

# బోనస్ ఇయ్యలే!

**ఉమ్మడి జిల్లాలో రూ.123 కోట్లు పెండింగ్**

- యాసంగిలో ఎకరాకు రూ. 500 ఇస్తామన్న ప్రభుత్వం
- రెండు నెలలు గడిచినా ఒక్క రైతుకూ చెల్లించని వైనం
- ఆశగా ఎదురుచూస్తున్న అన్నదాతలు
- ముందే ప్రారంభమైన వానకాలం సీజన్
- పెట్టుబడి కోసం అప్పులు చేస్తున్న రైతులు

అన్నదాతలను కాంగ్రెస్ సర్కారు ఆగం చేస్తున్నది. సన్న వడ్లు పండించిన రైతులకు బోనస్ చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. వానకాలం సాగు సీజన్ మొదలవుతున్నా ఇప్పటికీ యాసంగి వడ్లను పూర్తిగా కొనుగోలు చేయలేదు. సన్న వడ్లకు యాసంగిలోనూ క్వింటాకు రూ. 500 బోసన్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించి రెండు నెలలు గడుస్తున్న ఒక్క రైతుకూ చెల్లించలేదు. వానకాలం ప్రారంభం కావడంతో పంటల సాగుకు రైతులకు పెట్టుబడి అవసరం ఉన్నది. ఈ పరిస్థితుల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను పట్టించుకోవడంలేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో యాసంగిలో 6.60 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 2.47 లక్షల టన్నుల సన్న వడ్లను కొనుగోలు చేసింది. ఈ వడ్లకు సంబంధించిన రూ. 123 కోట్ల బోనస్ మొత్తం రైతులకు చెల్లించాల్సి ఉన్నది. నైరుతి రుతుపవనాలు ముందుగానే రావడంతో పంటల సాగు ఈసారి త్వరగా మొదలవుతున్నది. పెట్టుబడి ఖర్చుల కోసం రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తేవాల్సి వస్తున్నది. దొడ్డు వడ్ల కంటే సన్న వడ్లు పండించడం కష్టమైన పని. సన్నాల పంట కాలం ఎక్కువగా ఉంటుంది. ఎరువులు, పురుగు మందుల రూపంలో ఈ పంట సాగుకు పెట్టుబడి అధికంగా అవుతుంది. దొడ్డు వడ్ల కంటే సన్న వడ్ల ఉత్పత్తి తక్కువ ఉంటుంది. రైతులు కష్టపడి పండించిన సన్న వడ్లకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1130 కొనుగోలు కేంద్రాల్లో 9.73 లక్షల వడ్లను కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఇప్పటి వరకు 6.15 లక్షల టన్నుల వడ్లను కొనుగోలు చేయగా, ఇందులో 2.47 లక్షల టన్నుల సన్న వడ్లున్నాయి. వీటికి సంబంధించి బోనస్ డబ్బులు తమ ఖాతాల్లో ఇంకా జమకాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. అయితే రుతుపవనాలు ముందే వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇప్పటికీ వడ్ల కొనుగోలును పూర్తి చేయలేదు. అనేక ఊర్లలో ఇప్పటికీ ధాన్యం కాంటాలు కాకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ఉడడంతో వర్షాలకు తడిసి మొలకెత్తుతున్నాయి. దీంతో చేతికి వచ్చిన పంట చెడిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.



తొర్రూరు మండలం అమ్మాపురం కొనుగోలు కేంద్రం వద్ద మహిళా రైతు సోమలక్ష్మి నిలదీయడంతో సమాధానం చెప్పలేక వెళ్లిపోతున్న అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి (ఫైల్)



ఏకశిల పార్కు ఎదుట కార్మికులతో కలిసి నినాదాలు చేస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

## హక్కుల కోసం ఉద్యమిద్దాం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచుదాం
- బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం
- కార్మికులతో కలిసి ఏకశిల పార్కు ఎదుట ధర్నా

నయీంనగర్, మే31 : కార్మికుల సంక్షేమాన్ని కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని, వాటి మెడలు వంచి ఉద్యమాలతో హక్కులు సాధించుకుందామని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కార్మిక మాసోత్సవాల్లో భాగంగా శనివారం బాలసముద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ స్మృతివనం (ఏకశిల పార్కు) ఎదుట వివిధ కార్మిక సంఘాలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలనే ఉద్దేశంతోనే ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వేలాది మంది చిరు వ్యాపారుల కుటుంబాలను మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు వేధించడాన్ని ఆపేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చిరు వ్యాపారుల రక్షణ కోసం చట్టం తెచ్చేలా నాడు బీఆర్‌ఎస్ ఎంపీలు ఒత్తిడి తెచ్చారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ హయాంలో మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు అనేక రుణాలు అందించామని, వెండింగ్ జోన్లు ఏర్పాటు చేశామన్నారు. 2014లో తీసుకొచ్చిన చిరు వ్యాపారుల రక్షణ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నరగా కార్మిక శాఖకు మంత్రిని నియమించకపోవడం కార్మికులపై వారికున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కార్మికులకు ఏమీ చేయని కాంగ్రెస్ సర్కారు, భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను మళ్లించిందని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ ఆధ్వర్యంలో కేటాయించిన 2,600 గజాల స్థలంలో కార్మిక భవన్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు. జూన్ 9న దేశ వ్యాప్తంగా జరుగనున్న సార్వత్రిక సమ్మెలో ప్ర కార్మిక సంఘం.. కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికుల పొట్ట కొట్టిందని, వారికిచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ. 12,000 భృతి ఇవ్వాలని, ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలను ఆదుకోవాలని దాస్యం డిమాండ్ చేశారు. కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, సంకు నర్సింగ్, సోదా కిరణ్, నాయిని రవి, ఎంజాల మల్లేశం, ఈసంపల్లి సంజీవ, రవీందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జయరాం, తేలు సారంగపాణి, రఘుపతిరెడ్డి, శివకుమార్, కాటపురపు రాజు, రాజారపు రాజు, భిక్షపతి, రఘు, కృష్ణ, రాజు, ఎండీ ఇస్మాయిల్, గుంజ స్వామి, కొండయ్య రవి, మా తెలంగాణ, ప్రతాపరుద్ర ఆటో యూనియన్ నాయకులు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

## రైతుల అష్టకష్టాలు

- సీజన్‌లో తీవ్రంగా నష్టపోయిన మానుకోట రైతులు
- చేతులెత్తేసిన జిల్లా యంత్రాంగం

మహబూబాబాద్, మే 31(నమస్తే తెలంగాణ) : ధాన్యం రైతులకు కష్టాలు తప్పడం లేదు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చింది మొదలు.. బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడేవరకు రైతులు నరకం చూస్తున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో సజావుగా సాగిన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ.., కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆలస్యంగా జరుగుతున్నది. తేమశాతం, అకాల వర్షాలు, కాంటాలు అయిన తర్వాత మిల్లులకు తరలించకపోవడం, మిల్లుల్లో తేమశాతం, తాలు పేరుతో క్వింటాలుకు మూడు నుంచి నాలుగు కిలోల ధాన్యం తరుగు తీయడం, ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత 10 నుంచి 20 రోజుల తర్వాత రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడడం వంటి కారణాలతో ఇప్పటికే రైతులు విసిగిపోయారు. దీంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన సన్నాలకు బోనస్ డబ్బుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. అసలు అవిపడుతాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన జాయింట్ కలెక్టర్ వీరబ్రహ్మాచారి సైతం పట్టించుకోకపోవడంతో క్షేత్రస్థాయి సిబ్బంది విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సమన్వయం చేయాల్సిన జాయింట్ కలెక్టర్ వీరబ్రహ్మాచారి నుంచి మొదలు పౌర సరఫరాల సంస్థ డీఎం కృష్ణవేణి, జిల్లా అధికారి ప్రేమ్‌కుమార్, సహకార శాఖ, జిల్లాలోని ఇద్దరుఆర్డీవోలు, తహసీల్దార్ల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. కాగా, కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతో ధాన్యం అమ్ముకున్న రైతులకు ఇప్పటికీ సుమారుగా 6వేల మందికి డబ్బులు పడలేదు. బోనస్ డబ్బుల కోసం 14వేల మంది రైతులు ఎదురుచూస్తున్నారు.



కొత్తపేటలో కాంటా అనంతరం లారీలో లోడ్ చేస్తున్న ధాన్యం బస్తాలు

## మిల్లుకు ధాన్యం తరలింపు

నమస్తే ఎఫెక్ట్

బయ్యారం, మే 31 : మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంకొత్తపేట కొనుగోలు కేంద్రంలోని రైతుల ధాన్యాన్ని కాంటా వేసి శనివారం మిల్లుకు తరలించారు. యాసంగిలో పెద్దచెరువు కింద సాగుచేసిన ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రానికి తీసుకురాగా, తేమ శాతం రాక, కాంటాలు పెట్టక రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో శుక్రవారం 'తేమ రాదు.. ధాన్యం కొనరు' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన సొసైటీ సీఈవో అనూష, ఏఈవో నాగరాజు, నిర్వాహకులు భద్రం, సతీశ్ శనివారం కాంటాలు వేసి లారీలో మిల్లుకు తరలించారు. కాంటాలు కాకపోవడంతో వర్షానికి చేతికొచ్చిన పంట నష్టపోతామేమోనని ఆందోళన చెందిన రైతులు కుదుటపడ్డారు.



ముత్యాలమ్మ గుడి వద్ద జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి, బీఆర్‌ఎస్ నాయకులు

## ప్రజలకు ఇబ్బందులుండొద్దు

- జంక్షన్ల నిర్మాణంలో జాగ్రత్తలు పాటించాలి
- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ రూరల్, మే 31 : ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జంక్షన్ల నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు పేర్కొన్నారు. శనివారం మానుకోట పట్టణంలోని ముత్యాలమ్మ గుడి, మూడు కొట్ల సెంటర్లు, కురవి రోడ్‌లో చేపట్టిన నూతన జంక్షన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు జంక్షన్ల నిర్మాణంలో జాగ్రత్తలు పాటించాలని, జిల్లా కేంద్రానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భారీ వాహనాల వల్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, అవసరమైన చోట డివైడర్లు ఏర్పాటు చేయాలన్నారు. ముత్యాలమ్మ గుడి వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా జంక్షన్ నిర్మించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పట్టణ శివారులోని డ్రైనేజీ వ్యవస్థతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు తక్కళ్లపల్లి సూచించారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, రఘు, కరుణాకర్‌రెడ్డి, శంకర్, గోపీ, వెంకన్న తదితరులున్నారు.

## మల్లంపల్లి మండలానికి జగదీశ్ పేరు

**ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

ములుగు రూరల్, మే 31 : ములుగు జిల్లా మల్లంపల్లి మండలాన్ని తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత జడ్పీ చైర్మన్ జగదీశ్ (జేడీ) మల్లంపల్లిగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో ములుగు పరిధిలో ఉన్న ఈ గ్రామాన్ని మండలంగా ప్రకటించిన విషయం విధితమే. పేరు మార్చడంతో ఇక నుంచి జేడీ మల్లంపల్లిగా మారనున్నది. మల్లంపల్లి వాస్తవాడైన జగదీశ్వర్ పేరుతో మండలానికి నామకరణం చేయాలని స్థానిక ప్రజల డిమాండ్ మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది.

## పాలకుర్తిలో కాంగ్రెస్ రౌడీయిజం

- తెలంగాణ తల్లి విగ్రహంతో రాజకీయం
- బీఆర్‌ఎస్ నిర్మించిన గద్దెను ఆక్రమించుకొని పనులు
- అడ్డుకున్న గులాబీ శ్రేణులు, టీఆర్‌ఎస్ సోషల్ మీడియా నాయకుడి అరెస్ట్
- ఇనుప రాడ్లతో దాడికి దిగిన కాంగ్రెస్ గూండాలు
- పోలీసులతో బీఆర్‌ఎస్ నేతల వాగ్వాదం, తోపులాట
- పోలీస్‌స్టేషన్‌కు వచ్చి దురుసుగా ప్రవర్తించిన కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి

పాలకుర్తి, మే 31: జనగామ జిల్లా పాలకుర్తిలో కాంగ్రెస్ నేతలు తెలంగాణ తల్లి విగ్రహం పేర రాజకీయం చేయడం వివాదాస్పదమైంది. ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి గొడవకు తెరలేపారు. గతంలో బీఆర్‌ఎస్ నిర్మించిన తెలంగాణ తల్లి గద్దెను అనుమతిలేకుండా ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి ప్రోద్బలంతో ఆక్రమించుకుని పునర్నిర్మాణానికి పూనుకున్నారు. దీంతో ఆగ్రహించిన బీఆర్‌ఎస్ శ్రేణులు కాంగ్రెస్ కార్యకర్తలను అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య తోపులాట జరగడంతో పోలీసులు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల అంబేద్కర్ జయంతి రోజు దేవరుప్పులలో అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రారంభించొద్దని కాంగ్రెస్ శ్రేణులు పోలీసులతో అడ్డుకుని రాజకీయం చేశారు. అంతకు ముందు కామారెడ్డిగూడెంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూల్చడానికి అధికారులు, కాంగ్రెస్ నాయకులు కుట్ర చేశారు. పాలకుర్తిలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపాన్ని కూల్చి కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు పూనుకున్నారు. వీటిని మరువక ముందే ఎమ్మెల్యే అండదండలతో శనివారం కాంగ్రెస్ శ్రేణులు పాలకుర్తిలోని రాజీవ్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గతంలో నిర్మించిన తెలంగాణ తల్లి విగ్రహ గద్దెను ఆక్రమించుకుని పునర్నిర్మాణానికి పూనుకున్నారు. దీనికి నిరసనగా పార్టీ శ్రేణులు గంట పాటు ధర్నా చేపట్టారు. గద్దె నిర్మాణాన్ని అడ్డుకునే క్రమంలో వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, ఎస్సై దూలం పవన్‌కుమార్‌తో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల ఆశోక్‌రెడ్డి వాగ్వావాదానికి దిగారు. బీఆర్‌ఎస్ నిర్మించిన గద్దెను కాంగ్రెస్ నాయకులు ఆక్రమించుకొని ఎమ్మెల్యే అండతో రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. కలెక్టర్ నుంచి మండల స్థాయి అధికారుల వరకు ఎమ్మెల్యేకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు.



పాలకుర్తిలో ఆందోళన చేస్తున్న గులాబీ శ్రేణులు

### పాలకుర్తిలో పోలీసు పాలన

పాలకుర్తిలో పోలీసు పాలన నడుస్తున్నదని, అధికార పార్టీ ఎమ్మెల్యే కనుసన్నుల్లో పని చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ కార్యకర్తలు కర్రలు, రాడ్లతో దాడి చేస్తుంటే పోలీసులు పట్టించుకోలేదన్నారు. రాజీవ్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు కుర్చీలు వేసుకుని అనుమతి లేని తెలంగాణ తల్లి గద్దె నిర్మాణం చేస్తుంటే పోలీసులు కాపలా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకురాలు హనుమండ్ల ఝాన్సీరెడ్డి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి బీఆర్‌ఎస్ శ్రేణులపై కేసులు పెట్టిస్తున్నదని నాయకులు మండిపడ్డారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా మండల కో ఆర్డినేటర్ జోగు గోపీని పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమని, వెంటనే విడుదల చేయాలని పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. తక్షణమే ఎమ్మెల్యే, పోలీసు ఉన్నతాధికారులు, కలెక్టర్ స్పందించి గద్దె నిర్మాణాన్ని ఆపాలని, లేకుంటే రేపు నియోజకవర్గ వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



పోలీస్ అధికారితో వాగ్వాదం చేస్తున్న ఝాన్సీరెడ్డి



కుర్చీలు వేసుకొని గద్దె నిర్మాణం చేయిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## హోంగార్డు కుటుంబానికి దిక్కెవరు.?

- క్యాన్సర్‌తో పోరాడి ఓడిన శంకర్
- 20 ఏళ్లుగా పోలీస్ శాఖలో సేవలు
- గుండె వ్యాధితో బాధపడుతున్న మృతుడి భార్య
- ఇద్దరు కూతుళ్లతో బతుకు పోరాటం
- ఆర్థిక ఇబ్బందుల్లో కుటుంబం
- ప్రభుత్వం, డిపార్టుమెంట్ సహకారం కరువు

జయశంకర్ భూపాలపల్లి, మే 31 (నమస్తే తెలంగాణ) : క్యాన్సర్ మహమ్మారి హోంగార్డు కుటుంబాన్ని రోడ్డున పడేసింది. రెండేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో పోరాడుతున్న మామిడాల శంకర్ ఈ నెల 25న తుది శ్వాస విడిచారు. 20 ఏండ్లుగా పోలీస్ శాఖలో హోంగార్డుగా చాలీ చాలని జీతంతో ఆయన సేవలందించారు. అటు ప్రభుత్వం ఇటు పోలీస్ శాఖ నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందకపోవడంతో ఆరోగ్యశ్రీతో పాటు అప్పులు చేసి చికిత్స పొందినా ఫలితం లేకుండా పోయింది. హోంగార్డు దీన స్థితిని 'నమస్తే తెలంగాణ' జనవరి 26న 'అంపశయ్యపై హోంగార్డు' అనే కథనం ద్వారా వివరించింది. దీనికి దాతలు స్పందించి సహకారం అందించడంతో శంకర్ వైద్యం చేయించుకున్నారు. అయినా నయం కాకపోడంతో ఇటీవల మృతి చెందాడు. శంకర్, అతని భార్య విజయలక్ష్మికి నా అన్న వాళ్లు ఎవరూ లేకపోవడంతో ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నది. ప్రభుత్వం, డిపార్ట్‌మెంట్ చేయూత కోసం చేతులు చాస్తుంది.



హోంగార్డు మామిడాల శంకర్ (ఫైల్)

### పూట గడిచేదెలా

భూపాలపల్లిలోని రాజీవ్‌నగర్‌లో అద్దె ఇంట్లో నివాసముండే మామిడాల శంకర్ 20 ఏళ్లుగా పోలీస్ శాఖలో హోంగార్డుగా సేవలందించాడు. గణపురం మండలం లక్ష్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన శంకర్ భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేశాడు. ఊహించని విధంగా క్యాన్సర్ మహమ్మారి ఆ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. రెండేళ్ల క్రితం శంకర్‌కు క్యాన్సర్ సోకడంతో ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేయించుకున్నారు. మళ్లీ ఆపరేషన్‌కు ఆరోగ్యశ్రీ కింద అవకాశం లేకపోవడంతో అప్పులు చేసి చికిత్స పొందాడు. శంకర్‌కు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్దకూతురు లక్ష్మీసువిధ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుంది. చిన్న కూతురు లక్ష్మీఅవంతికకు మూడేళ్లు. ఇద్దరు కూతుళ్ల పరిస్థితి ఏంటని బాధితుని భార్య విలపిస్తున్నది. ఎవరూ లేని తాను పిల్లలను ఎలా సాకాలని, ఇప్పటి నుంచి పూట గడిచేదెలా? ఇంటి అద్దె కట్టేదెలా అని విలపిస్తున్నది.

### మమ్మల్ని బతికించండి

నాకు ఇద్దరు ఆడ పిల్లలు. మాకు వేరే ఆధారం లేదు. మా ఆయనకు తల్లిదండ్రులు, నాకు తల్లిదండ్రులు లేరు. మాకు ఇతర ఆస్తులు లేవు. మా ఆయన హోంగార్డు ఉద్యోగం చేస్తేనే ఇన్నాళ్లు బతికాం. రెండేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతూ మృతిచెందాడు. చికిత్సలకు చేసిన అప్పులు ఎలా తీర్చాలి. ఇద్దరు ఆడ పిల్లల పరిస్థితి ఏంటి. ఇంట్లో పూట గడిచేదెలా. నాకు కుడి చేయి పనిచేయదు. అన్నం కూడా ఎడమ చేయితో తింటాను. గుండె సమస్య ఉంటే డబ్బులు లేక చికిత్స చేయించుకుంటలేను. ఇప్పటి వరకు పోలీసు అధికారులు మాకు ఎలాంటి సహకారం అందించలేదు. కనీసం ఇప్పుడైనా కనికరించండి. మమ్మల్సి బతికించి ఒక దారి చూపండి. తండ్రి చనిపోతే హాస్టల్ నుంచి నా బిడ్డ ఇంటికి రావడానికి కూడా డబ్బులు లేని పరిస్థితి. తోటి హోంగార్డులు వెయ్యి రూపాయలు పంపిస్తే ఇంటికి వచ్చింది.


– విజయలక్ష్మి, శంకర్ భార్య



## పద్మ అవార్డు సమాజానికి అంకితం

**ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ**

హనుమకొండ, మే 31 : భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్న పద్మశ్రీ అవార్డును సమాజానికి అంకితం చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ప్రకటించారు. పురస్కారం పొందిన తర్వాత శనివారం రాత్రి ఢిల్లీ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్‌కు వచ్చిన మంద కృష్ణ మాదిగకు ఎమ్మార్పీఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అక్కడి నుంచి ర్యాలీగా హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ పురస్కారం ఎమ్మార్పీఎస్ చేస్తున్న పోరాటానికి అండగా నిలిచిన సమాజానికి దక్కిన గౌరవమన్నారు. ఈ ఏడాది ఎస్సీ వర్గీకరణ ఉద్యమం విజయం సాధించడం, పద్మశ్రీ పురస్కారం దక్కడం దేశంలో మాదిగ జాతి గౌరవాన్ని మరింత పెంచిందన్నారు.



హనుమకొండ చౌరస్తాలో గజమాలతో సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు